ఉమాపతీ మందుల పెట్టిలో మందుల పేర్లన్నీ నాకు కంఠతావచ్చు. నేను మందులు కట్టి వచ్చిన వాళ్ళకు ఇస్తూ వుండేదాన్ని. కాని మా నాన్న మందుకోసం వచ్చినవాళ్ళకు వేసే ప్రశ్నలు నాకు నవ్వు పుట్టిస్తూవుండేవి. ఉమాపతీ వైద్యంలో రోగం కన్నా ప్రశ్నలతో ఎక్కువ బాధపడతాడు రోగి. ఆ మందులిచ్చేముందు ఏవిటితిన్నావని అడిగి ఆ తినకూడని దేదో తిన్నందుకు రోగిని రోగి తాలూకు బంధువుల్ని బూతులు తిడుతూ వుండేవాడు మా నాన్న!

నేను మీ ఇంటి కొచ్చాక కాఫీతాగటం నేర్చుకున్నాను. మీరు నాకు పత్రికలు. కథలు చదవడం నేర్పారు. ఇప్పుడు నాకనిపిస్తుంది. మొగుడే కాపరానికి రాబోయే పెళ్ళాన్ని తీర్చిదిద్దుకునే వాడు ఆ రోజుల్లో. కాపురాని కెళ్ళటంతో ఆడ పిల్లకు నిండుతనం గౌరవం వచ్చేస్తాయి. ఇప్పటికీ, ఎప్పటికీ మొగుడే పెళ్ళాన్ని తనకు కావలసిన చక్కటి పద్ధతిలో తీర్చిదిద్దుకోవాలి. ఇందులో ఎక్కువ తక్కువ లేమిటి నా మొహం? మొగరాక్షసులూ ఆడ పీనుగులూ వుంటే వుంటారు నవలల్లో. కాని జీవితాల్లో సర్దుకుంటూ పోవాలి. ఆడా మగా అంటూ పోట్లాడుతూ కూర్చుంటే మీకర్మమీది; ఈలోగా వయసు సొగసూ మనల్నిదాటి పలకరించకుండా వెళ్ళి పోతాయి. ఈవాళేమిటిలా ఆరిందాలా పెద్ద నవలలు రాసేదానిలా మాట్లాడేస్తున్నాను?

అన్నట్లు "నా దవుటు" అలానే వుండిపోయింది. ఈ హార్మనీ పెట్టెలోని ప్రేమలేఖల్ని ఏమిచేయమంటారు? అంత సిగ్గెందుకండీ అలా వినిపించనట్టు మిమ్మల్ని కానట్టు వెళ్ళిపోతున్నారు? అయితే ఇల్లాళ్లందరూ కోర్టు దస్తావేజులు, ప్రామిసరీ నోట్లలా పెట్టి అంతా ఆక్రమించుకున్న చీరె మడతల్లోని ఈ పాత వుత్తరాలను ప్రేమలేఖల కట్టలను ఏమి చేస్తారు? బైండ్లు కట్టించి గత స్మృతుల్ని రెండు అట్టల మధ్య బంధించగలరా అని అడుగుతున్నాను.

చెప్పండి నా ప్రశ్నలకు సమాధానం?

# వెలిసిపోయిన పెళ్ళిఫోటో

ఫ్రేము వూడిపోయిన పటాలుకొన్ని ఇంట్లో వో మూల పారేశాము. ఆజంకులో యీమధ్య వో వెలిసిపోయిన అట్టలాక్కొచ్చి దానికోక్లిప్పు పెట్టి పరీక్షలు రాసుకుంటున్నాడు రాము. తీరా పరీక్షగా చూద్దునుగదా. అది మన పెళ్ళి ఫోటో : వెలిసిపోయి వెలవెల బారుతూ వున్న అట్టమీద మనల నిద్దర్నీ ఒకచోట నిలబెట్టి జిగురెట్టి చెక్కు చెదరకుండా అంటించాడు ఎవడో ఫోటోగ్రాఫరు. మనమిద్దరమూ ఎక్కడికేనా పారిపోతావేమో నన్న భయంతో కాబోలు పెద్దవాళ్ళు చెంగుచెంగూగట్టిగా ముడేశారు. అందులో బుట్టబొమ్మలాగ నాకు బెనారస్ పట్టుచీరకట్టబెట్టి మెడనిండా వాళ్ళవీ వీళ్ళవీ నగలు తెచ్చి దిగేశారు. మీరు మోకాళ్ళ క్రిందకి చొక్కా తొడుక్కున్నారు.

మెళ్ళో కర్పూర దండలు చెమ్కీదండలు వేశారు. చొక్కాకి క్రియేషన్స్ గుండీలు కాలరుకి క్రిమిన్స్ పిన్ను పెట్టుకున్నారు. నేను కొంచెం పొట్టిఅని నన్ను ఎత్తుమీద నిల్చోపెట్టారు. మీరు గోతిలో నుంచున్నట్లు వున్నారు. చూపులో కొంచెం మెల్లవున్నట్లు వుంది. ఆతోటలో ఆవేళ ఆ చెట్టు కింద ఎత్తుపల్లాల్లో మనల్ని నిల్చోపెట్టి ఎవడో చేతకాని ఫోటోగ్రాఫరు పెళ్ళి ఫోటో తీశాడు. మనమిద్దరం ఆరోజు ఆక్షణం ఆఫోటోగ్రాఫరు చేతిలో బఫూన్లులా చిక్కడ్డాం. మీరు ఆశగా ఆకాశం లోకి చూస్తున్నట్లున్నారు. నేను సిగ్గుతో నేలచూపులు చూస్తున్నాను. ఆ ఏడే మీ ఇంటర్‌మేటు పరీక్ష చెట్టుక్కుతుందనీ శుభ్రంగా ఆనర్స్ చదివి ఏ లెక్చరరుగానో వెళ్ళవలసిన మీరు రయిల్వే గుమాస్తాగా మారి పోతారని మీకు తెలీదు. నాలుగైదేళ్ళలో ఇద్దరు ముగ్గురు పిల్లలు పుట్టుకొచ్చేసి పువ్వులా గుమగుమలాడి పోవలసిన జీవితం నలిగి నాశనమయి "ఫిట్లు" వస్తాయని అడుగేస్తే పడిపోతానని నాకు తెలీదు.

ఈ వెలసిపోయి వెల వెలబారిపోతున్న పెళ్ళిఫోటో చూస్తుంటే మన పెళ్ళి ముచ్చట్లు గుర్తొస్తున్నాయి. మీకు నేను కనుపించకూడదట. అందుకని పొరపాటున మీరు ఎదురుపడితే తలుపులు ద్వారబంధాలు అడ్డుచూచుకోకుండా దూకుతూ గెంతుతూ పరిగెత్తిపోయేదాన్ని. ఓ రోజు మానాన్న ఇంకోకూర ఎక్కువచేసి నందుకు అరుగుమీద తైమని ఎగుర్తూ వంట బ్రాహ్మల్ని బూతులు తిడుతూ కాలభైరవుడిలా విజృంభించడం నాకుగుర్తుంది. ఆడబడుచు లాంఛనాలు మరొక 50 ఎక్కువ అడిగినందుకు మానాన్న గింజుకుంటే మీవాళ్ళు మిమ్మల్ని విడిదిలోకి తీసికెళ్ళి దాచేశారు. అప్పగింతల బట్టలు పెట్టినప్పుడు అందరికీ బట్టలు పెట్టలేదు. సావిట్లోంచి పెద్దమామయ్యగారు లేచి వెళ్ళిపోతుంటే మామయ్యగారు చిన్నబుచ్చుకున్నారు. మీకేమీ కట్నమూ, కానుకలూ ఇవ్వకపోగా చిన్న చిన్న లాంఛనాల దగ్గర మావాళ్ళు వెలితిపడ్డం మీకందరికీ కోపాలు రావడం నాకు ఇప్పటికీ బాగాగుర్తు.

ఇంటిముందు రోడ్డుమీద పందిరివేసి పెళ్ళిచేశారు. ఆ పెళ్ళిలో మానాన్న హడావిడి కేకలు కంగారూ తప్ప నాకింకేం గుర్తులేవు. ఆ నరసాపురం కాలవగట్టు. ఊళ్లో కొబ్బరి చెట్లనీడను నడిరోడ్డులో తాటాకుల పందిరి క్రింద చల్లగా మన పెద్దలుమనకుపెళ్ళిచేసి మీపాట్లు మీరు పడండని జీవితంలోకి పడవను నీళ్ళల్లోకి త్రోసినట్లు తోశారు. మనిద్దరినీ ఒక కంచంలో భోంచెయ్యమన్నారు. రూపాయ లాట, చెండ్లు విసరటంలాంటి వేడుకలు జరిపారు. ఆడవాళ్ళు వదినలు, అక్కయ్యలు, పిన్నిగార్లు ఎన్నో పాటలు పాడారు. బహుమతులిచ్చారు. ఆశీర్వదించారు. అందరి కాళ్లకూ వంగి లేచి దండాలు పెట్టేసరికి నడుంపడి పోయిందనుకోండి.

అప్పటికి ఇంకా చిన్న పిల్లలమేగా – వీధిలో చెరో వంట బ్రాహ్మడూ మనల్ని ఎత్తుకుని 'జంఝునక' "జంఝునక" అంటూ అడుగులు వేస్తూ బుక్కాజల్లుకున్నారు.

ఆ దండాడింపు తలుచుకుంటూంటే ఇప్పటికీ నాకు నవ్వొస్తుంది. మనకంటె వంట బ్రాహ్మలు బుక్కా ఎక్కువ చల్లుకున్నారు. మీరు నాకళ్లల్లో బుక్కా పోసేశారు. నేను దిగి పోదామనుకున్నా వంట బ్రాహ్మలు వో అరగంట దింపకుండా నన్ను ఎత్తుకొని గంతులు వేశారు. ఇప్పుడు ఏ

పెళ్ళికూతిరిని ఏ వంట బ్రాహ్మడు ఎత్తుకోగలడు? ఆ వేళ మనల్ని ముత్యాల పల్లకీలో కూర్చోపెట్టి వూరేగించారు. పాలకొల్లు నించి వచ్చిన సన్నాయి మేళం నూటపదహార్లూ పుచ్చుకుని కృతులూ, తరంగాలు జగన్మోహనంగా దేవదుందుభులు మ్రోగేలా వాయించారు. పెద్దలూ పేరంటాళ్ళ మధ్య పల్లకీలో వూరేగినట్లు రోజులు సాగి పోవాలనుకుంటే మనవల్ల నవుతుందా? ఎన్ని బాధలు? ఎన్ని కష్టాలు? ఎన్ని కన్నీళ్ళు; ఎన్ని నిట్టూర్పులు. జీవితమంటే – మల్లెపూలతోనూ మంచిగంధంతోనూ ప్రారంభమవుతుందనుకున్న మన జీవితం పాల డబ్బాలతో ప్రారంభమయింది. దేశంకాని దేశంలో ఉద్యోగం – బొటాబొటి జీతం – ఐదురూపాయల ఇంటద్దె ఇచ్చి అందరి వెనక్కాలవున్న కూలి పోబోతున్న ఒంటి గదిలో అర్ధరాత్రి కొరివిదయ్యాల్లా కనిపించే దీపాల్ని చూస్తూ మట్టినేల అలుక్కుంటూ నులకమంచంకుక్కిలో కాపురం చేస్తామని అనుకోలేదు గదా; అప్పుడుజీవితం మొదట్లో అది దుర్భరదారిద్ర్యమని మనకు తెలియదు. వయసూ సొగసూ వలపూ ఈ మూడింటి ముందు డబ్బు ఆస్తి అంతస్తు దమ్మిడీకి కొరగావని ఢంకా బజాయించి చెప్తాను. మనకు గల అనురాగం అభిమానాలే పెట్టని  కోట. లేకపోతే మనం ఏనాడో ఆత్మహత్య చేసుకోవలసిన వాళ్ళం.

ఆపేక్షలూ అంతఃకరణలూ లేకపోతే ఈ సంసారంలో నెగ్గుకు రాగలవా? మీరు ఇంటికి ఆలస్యంగా వచ్చేవారు. సిగరెట్లు తెగ కాల్చేవారు. నాటకాలు వేయిస్తూ, క్లబ్బులనీ, సంఘాలనీ దిక్కుమాలిన తిరుగుళ్ళన్నీ తిరిగేవారు. అలా నన్ను చంటిపిల్లలినీ దిక్కుమాలిన కొంపలో పడేసి అర్ధరాత్రీ అపరాత్రీ వస్తూంటే నేను మీతో పోట్లాటవేసుకునే దాన్ని. అడపా తడపా రెండు తగలనిచ్చేవారు. పెళ్ళినాడు మీరు నా మెళ్ళో కర్పూరదండ వేసినప్పుడు, తరువాత ఆ చేత్తోనే ఈ లెంపా, ఆ లెంపా రెండూ వాయిస్తారని పిచ్చి మొద్దుని నాకేం తెలుసు? మా నాన్న మా అమ్మని చెడ్డదెబ్బలు కొట్టేసేవాడు. అంత ఎక్కువగా దెబ్బలు కొట్టకుండా అప్పుడప్పుడు లెంపకాయలు మాత్రమే కొట్టినందుకు మీకు మనసులో ధన్యవాదాలు చెప్పుకునేదాన్ని.

కాపురమంటే మొగుడిచేత మొట్టికాయలూ, చెంపదెబ్బలు తినకుండా వెళ్తుందా? రెండు దెబ్బలు తింటేనే అనుబంధాలు గట్టిపడతాయనేది మా అమ్మమ్మ. మా ఊళ్ళో ఒకాయన పెళ్ళాన్ని గొడ్డును బాదినట్లు బాది వొంటిమీద చీరను కూడా లాక్కుని చీకట్లో తలుపుతీసి దొడ్లోకి గెంటేసే వాట్ట; ఆ ఇల్లాలు చీకట్లో, చలిలో భయంతో చెట్ల మధ్యన నూతి ప్రక్కన కూర్చుని తెల్లవార్లూ దీనంగా ఏడుస్తూ వుండేది. ఇది అధర్మం ఇది దారుణం. అని ఎవరూ అనేవారు కాదు. ఆవిడ నూతిలోపడి చచ్చిపోయింది. నెల తిరక్కుండానే ఆ ముండాకొడుకు మళ్ళీ పెళ్లిపీటలమీద ఎక్కి కూర్చున్నాడు. పిల్లనిచ్చిన వాళ్లూ వున్నారు, పెళ్ళికి తర్లివచ్చినవాళ్లూ వున్నారు. అందుకే ఆడబ్రతుకులు అడివీ, అధ్వాన్నమూనూ;